జనం కోసం..
అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్
Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 317 | 10 జులై 2026 | శుక్రవారం | 4 పేజీలు



## జనసేన పార్టీలో చేరిన మీసాల శ్రీనివాసరావు

### - జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

నిజామాబాద్ జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమ నేత సామాజిక కార్యకర్త మీసాల ఫౌండేషన్ అధినేత మీసాల శ్రీనివాసరావు గురువారం హైదరాబాద్ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నివాసంలో జనసేన పార్టీలో చేరారు .అనంతరం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా మీసాల శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మీసాల శ్రీనివాస్ తమకు 20 సంవత్సరాల అనుబంధం కలదని అదే విధంగా మీసాల ఫౌండేషన్ చేస్తున్నటు వంటి సేవా కార్యక్రమాలు ఎంతో సంతోషకరమని అన్నారు. అనంతరం జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రజలకు చేరువై జనసేన సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం మీసాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు ప్రజా సేవకు పార్టీ కట్టుబాటు పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసంతో చేరినట్లు తెలిపారు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.




## ఓటర్ ఎన్యూమరేషన్ ఫారంలను త్వరగా బీఎల్‌వోలకు అందించాలి

### - ఎస్ఐఆర్ అమలులో అలసత్వం ప్రదర్శించిన సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ : కలెక్టర్

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారంలను తగిన వివరాలతో పూరించి త్వరితగతిన బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఓటర్లకు సూచించారు. వివరాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్నందున, నిర్ణీత గడువు వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఫారాలను నింపి బీ.ఎల్.ఓలకు సమర్పించాలని ఓటర్లను కోరారు. శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటి కమిషనర్ పవన్ కుమార్ శర్మ న్యూడిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డితో పాటు అన్ని జిల్లా కలెక్టర్లతో ఎస్.ఐ.ఆర్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల వారీగా ఎస్.ఐ.ఆర్ అమలులో ఇప్పటివరకు సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకుని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వాటి వివరాలను డిజిటలైజ్ చేయడంలో వెనుకంజలో ఉన్న సూపర్వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో పురోగతి చూపని నిజామాబాద్ అర్బన్ పరిధిలోని ముగ్గురు సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

## ఈద్గా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



నగరంలోని ధర్మపురి హిల్స్‌లో నిర్మాణంలో ఉన్న అహ్లే హదీస్ ఈద్గా అభివృద్ధికి రూ.18.15 లక్షల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను కమిటీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈద్గా నిర్మాణం పూర్తయితే ధర్మపురి హిల్స్‌తో పాటు పరిసర ప్రాంతాల ముస్లిం సోదరులకు ప్రార్థనలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని వివరించారు. దీనికోసం ప్రభుత్వం రూ.18.15 లక్షలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారు. ఈద్గా నిర్మాణానికి అవసరమైన నిధులు వీలైనంత త్వరగా మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. షబ్బీర్ అలీకి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆత్మహత్యకు యత్నించిన పదో తరగతి విద్యార్థి

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

పదో తరగతి విద్యార్థి గురువారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సదాశివనగర్ మండల కేంద్రంలో ని బీసీ బాలుర వసతి గృహం లో జరిగింది జరిగింది , కామారెడ్డి జిల్లా . గాంధారి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాఘవేంద్ర అనే విద్యార్థి హాస్టల్‌లో పుస్తకాలు, ఇతర వస్తువులకు ఉపయోగించే రబ్బర్ బ్యాండ్లను మెడకు బిగించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన హాస్టల్ వార్డెన్ సునీత వెంటనే కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉన్నతాధికారులతో పాటు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.


జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 317 | 10 జులై 2026 | శుక్రవారం | 4 పేజీలు




### 15వ తేదీ లోపు..

# నామినేటెడ్ పోస్టుపై క్లారిటీ

◆ సీఎం, ఇంచార్జ్‌తో చర్చించాలి : పీసీసీ చీఫ్ మహేష్

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)

పదవి కాలం పూర్తి అయిన కార్పొరేషన్ లకు ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్లతో చర్చించి కార్పొరేషన్ పదవులపై తుది నిర్ణయం తీసుకుంటామని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ లో అంతర్గత వ్యవహారాలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేసారు.. కడియం శ్రీహరి, కొండ సురేఖ, తుంగతుర్తి లో రచ్చ వ్యవహారాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డి పరిశీలకులుగా నియమించామని వెల్లడించారు. వారిద్దరూ క్షేత్రస్థాయి నుంచి విచారణ జరిపి పార్టీకి నివేదిక ఇస్తారని, ఆ తర్వాతే క్రమశిక్షణా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.పదేళ్లు మంత్రిగా ఉండి హరీష్ రావు ఏం చేశారు? ఇప్పుడు మళ్ళీ మూడు నెలలు మంత్రిగా అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారు టైమ్ ఎందుకు ఇవ్వాలి? వారి హయాంలో నే కట్టిన ప్రాజెక్టులు కుంగిపోయాయి. దానికి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి బిఆర్ యస్ నేతలకు మిట్ట మధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో "హరీష్ రావు కాంగ్రెస్ పార్టీలోకి వస్తానని చెబితే, మా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు . బీఆర్ఎస్ నిధులపై స్పందిస్తూ.. కవిత చేసిన ఆరోపణల్లో నిజం ఉందన్నారు. ప్రాంతీయ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని, దీనిపై ఖచ్చితంగా అనుమానాలు వస్తున్నాయని అన్నారు.

## పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్టు

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నందిపేట్ మండలంలోని డొంకేశ్వర్ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నందిపేట్ ఎస్సై కె. వినయ్ వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం డొంకేశ్వర్ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఆ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్కడ పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి రూ. 22,960 నగదుతో పాటు తొమ్మిది మొబైల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ యూనివర్సిటీ బంద్ విజయవంతం




(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుమేరకు ఈ రోజు జిల్లావ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని చేపట్టామని, అందులో భాగంగానే తెలంగాణ యూనివర్సిటీ కూడా బంద్ కార్యక్రమం విజయవంతమైందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. అనిల్ కుమార్, యూనివర్సిటీ నాయకులు నితిన్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్ నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించేందుకు ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యాశాఖను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ మరియు ఇతర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ ఫీజు దోపిడీని అరికట్టాలని, విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేకమైన నూతన విద్యా విధానంను రద్దు చేసి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆల్గోట్ సృజన్, జిల్లా నాయకులు మున్నా, మనితేజ, శ్రీశాంత్, అరవింద్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 4 - సంచిక: 317 | 10 జులై 2026 | శుక్రవారం | 4 పేజీలు




## భారీ అప్పులు చేశాడు.. గయాబ్ అయ్యాడు

◆ రిటైర్డ్ అయిన మరుసటి రోజు నుంచి గయాబ్

◆ మూడున్నర కోట్లకు బీమా సంస్థలో ఉద్యోగి టోకరా

2 లో..

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

**పదవి విరమణకు ఆరు నెలల ముందు ఎడాపెడా అప్పులు చేశాడు.. దాదాపు మూడున్నర కోట్ల మేరకు వసూళ్లు చేశాడు. పదవి విరమణ చేసిన మరుసటి రోజు నుంచి గయాబ్ అయ్యాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. బాధితులు లబోదిబోమంటున్నారు.** నిజామాబాద్ ప్రముఖ బీమ సంస్థ ఎల్ఐసిలో ఓ కీలక హోదాలో పనిచేస్తున్న ఉద్యోగి పదవి విరమణకు ముందు ఆర్థిక అవసరాల కోసం అదే సంస్థలో పనిచేస్తున్న 15 ఏజెంట్‌లు 10సహచర ఉద్యోగులతో పాటు మరో పది మంది వివిధ పనుల కోసం ఆఫీస్‌కు వచ్చే వారి నుంచి అప్పుల రూపేణా రూ.5 లక్షల నుంచి పది లక్షల మేరకు తీసుకున్నాడు. అందుకు గాను చెక్‌లు ప్రామిసరీ నోట్‌లు సైతం ఇచ్చాడు.

నిజానికి సదరు ఉద్యోగి సంస్థలో పనిచేసే కాలంలో మంచి వ్యక్తి గుర్తింపు తెచ్చుకున్నారు. ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వకుండా పనిచేసారు. అందుకే అడిగిన వెంటనే అందరూ ఆర్థిక సహాయం చేసారు. అదీగాక ఆఫీస్ ఆయన కీలక బాధ్యతల్లో వుండడంతో అడిగిన వెంటనే అప్పు ఇవ్వడం అనివార్యం అయింది. దాదాపు 25 మంది నుంచి మూడున్నర కోట్ల మేరకు అప్పులు చేసాడు చేసిన అప్పులను పదవి విరమణ తర్వాత వచ్చే మొత్తం ద్వార తీర్చేస్తానని అందరికి భరోసా ఇస్తూ వచ్చాడు. ఆయన పదవి విరమణ చేసే టైం కూడా వచ్చేసింది.

## ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నూతన డిప్యూటీ కమిషనర్‌గా పి. శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డివిజన్ మినిస్టీరియల్ సిబ్బంది, టీఎన్జీవోస్ ఎక్సైజ్ ఫోరమ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కామారెడ్డి డీపీఈఓగా బాధ్యతలు చేపట్టిన ముకుంద రెడ్డిని సైతం వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నూతన డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ.. శాఖా పరమైన లక్ష్యాలను చేరుకోవడంలో సిబ్బంది అందరి సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమర్థవంతమైన పాలన అందించడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ విధుల్లో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరం వైస్ ప్రెసిడెంట్ కె. అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఏఏఓ నర్సయ్య, సీనియర్ కోఆపరేటివ్ ఇన్స్పెక్టర్ కలీం, సీనియర్ అసిస్టెంట్లు శ్రీధర్, దేవేందర్, స్టాఫ్ ఆఫీసర్ ఇమ్మాన్యుయేల్‌తో పాటు రిజ్వాన్, రాజు, రాణా, నాగరాజు, సబా, ప్రియాంక, సాయిబాబా, నిశిత డివిజన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## పాత నేరస్థులపై నిఘా.. అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)



నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణపై పోలీస్ కమిషనర్ సాయిచైతన్య గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు రాబోయే పండుగల దృష్ట్యా నిజామాబాద్ డివిజన్‌లో బందోబస్తును పటిష్టం చేయాలని కమిషనర్ సూచించారు. 24 గంటల పాటు వాహనాల తనిఖీలు చేపట్టాలని, విధుల్లో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. హత్యలు, హత్యాయత్నాలు, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై విడుదలైన వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి, గుట్కా, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని స్పష్టం చేశారు.మహిళల భద్రత విషయంలో రాజీపడకూడదని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలు విద్యాసంస్థలు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఏసీపీలు సీఐలు, ఎస్హెచ్ఓలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

10 జులై 2026 | శుక్రవారం | హైదరాబాద్ | 4 పేజీలు

### ఉద్యోగుల సంక్షేమం కోసం

## నిరంతరం కృషి చేస్తా



(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

తెలంగాణ నాన్-గెజిటెడ్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. ఎం. హుస్సేనీ (ముజీబ్) తన కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర పుణ్యక్షేత్రమైన మక్కాలో ఉమ్రా తీర్థయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కాబా గృహం వద్ద ఆయన అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేనీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతియుతమైన జీవనాన్ని గడపాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు.సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందడం ద్వారానే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు కీర్తిప్రతిష్టలు ఆర్జించాలని, తెలుగు రాష్ట్రాల్లో సోదరభావం, ఐకమత్యం వెల్లివిరియాలని కోరుకున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమం కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని డాక్టర్ హుస్సేనీ స్పష్టం చేశారు. తన సేవా కార్యక్రమాలను యూనియన్ వేదికగా మరింత ఉత్సాహంతో కొనసాగిస్తానని, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని హామీ ఇచ్చారు. ఉమ్రా యాత్ర తన జీవితంలో ఒక మరపురాని మధుర జ్ఞాపకమని, ఇక్కడి ప్రశాంత వాతావరణం తనకు సరికొత్త ఉత్సాహాన్ని, సేవా దృక్పథాన్ని ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో తనవంతు పాత్రను మరింత సమర్థవంతంగా పోషిస్తానని ఆయన తెలిపారు.




### హైడ్రా రద్దు చేయాలంటూ

# రోడ్డెక్కిన జనం

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

హైదరాబాద్ నగరంలో అక్రమ కట్టడాల కూల్చివేతలే లక్ష్యంగా ఉన్న హైడ్రా' ను రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తు మొదట సారి స్థానికులు రోడ్డెక్కారు శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎంఎస్ మక్తా బీఎస్ మక్తా బస్తీలకు చెందిన వేలాది మంది నివాసితులు శుక్రవారం రోడ్డుపైకి వచ్చి భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. 'హైడ్రాను రద్దు చేయాలి.. మా బస్తీలను కాపాడాలి' అంటూ ప్లకార్డులు పట్టు కొని పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. హుస్సేన్ సాగర్, నెక్లెస్ రోడ్డును ఆనుకొని ఉన్న ఈ చారిత్రాత్మక బస్తీలను ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్ పరిధిలోకి వస్తా యనే నెపంతో హైడ్రా అధికారులు త్వరలోనే కూల్చి వేస్తారనే నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తున్న తమ కు ముందస్తు నోటీసులు లేకుండా ఇళ్లను తొలగిస్తే తాము రోడ్డున పడతామని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆగ్రహించిన మహిళలు, స్థానికులు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా "సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి..

(హైదరాబాద్, ఇదీ సంగతి)



చంచల్‌గూడ ముద్రణాలయం నుంచి ఐఎస్ సదన్ మీదుగా సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ప్రముఖ సంఘసేవకురాలు, దివంగత సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినయ్ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ..నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి కోసం అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పేరుతో ఇందిరా సేవా సదన్ విద్యాసంస్థలను సంగం లక్ష్మీబాయి దశాబ్దాల క్రితమే స్థాపించారని గుర్తు చేశారు. ఆ విద్యాసంస్థల్లో చదువుకుని, ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన వేలాది మంది సమాజానికి విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. సంఘసంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా, విద్యావేత్తగా ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని, సైదాబాద్ ప్రాంతానికి ఆమె గర్వకారణమని కొనియాడారు. ఆమె సేవలను గుర్తించి, నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జికి ఆమె పేరును నామకరణం చేయాలని కోరారు. ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. తమ పోరాటానికి మద్దతుగా ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారులను కూడా కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాభిమాన్ పరిషత్ ప్రతినిధులు రాజు యాదవ్, సంతోష్, లక్ష్మీనారాయణ, దయానంద, వేణు, రాకేష్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీనివాస్, శేఖర్, సురేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## యువతులను ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్ ఒకరు మృతి

(హైదరాబాద్, ఇదీ సంగతి)



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అఓ బైకు ను ఢీకొట్టడం తో ఒకరు మృతి చెందగా మరొకరు సీరియస్ గా ఉన్నారు . ఇద్దరు మహిళలు గచ్చిబౌలి త్రిబుల్ ఐటీ నుండి అంజయ్య నగర్ కు యాక్టీవ పై వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్ద వీరు ప్రయాణిస్తున్న యాక్టివా స్కూటీని వెనక నుంచి వేగంగా వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మల్లం భవాని అక్కడికక్కడే మృతి చెందగా సుభాషినికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఇదీ సంగతి
జనం కోసం.. అక్షర సమరం

# ఎల్ నినో ప్రభావం గురించి రైతుల్లో అవగాహన కల్పించాలి




(నిజామాబాద్ ఇదీసంగతి)

ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులకు ఈ విషయమై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా నీటి ఎద్దడిని తట్టుకునే ఆరుతడి పంటలను విత్తుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

ఎల్ నినో వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున పంటల సాగుపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. రాష్ట్రంలోని 18 జిల్లాలలో లోటు వర్షపాతం నెలకొని ఉందని వాతావరణ శాఖ అధికారులు మంత్రులు దృష్టికి తెచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం సగటున 887 మిల్లీ మీటర్లు కురియాల్సి ఉండగా, 673 మిల్లీమీటర్ల మాత్రమే కురిసిందని, 24శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యిందని వివరించారు. గోదావరి, కృష్ణా బేసిన్ లలో కూడా 20 నుండి 25 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉందని అన్నారు. ఎగువన గల మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన జలాశయాలతో పాటు తెలంగాణలోని సింగూరు, మిడ్ మానేరు, కడెం, శ్రీశైలం, జూరాల, శ్రీరాంసాగర్ తదితర ప్రాజెక్టులలో గత ఏడాదితో పోలిస్తే తక్కువ నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు కీలక సూచనలు చేశారు. నీటి ఆధారిత పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా రైతులకు ఎల్ నినో ప్రభావం గురించి తెలియజేయాలన్నారు. నీటి ఆధారిత పంటలు వేసినట్లయితే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున రైతులు నష్టపోతారు అనే విషయాన్ని వారికి స్పష్టంగా తెలియజేయాలని అన్నారు.

శ్రీరాంసాగర్ తదితర రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన పక్షంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేసేందుకు వీలుగా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని అన్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రైతులకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల దారి మళ్లింపు వంటి వాటికి ఆస్కారం లేకుండా గట్టి పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాష్, డీఎస్ఓ శ్రీకాంత్, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్
తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కూలీ మృతి.. మరొకరి పరిస్థితి విషమం

(నిజామాబాద్ ఇదీసంగతి)

నూతన భవన నిర్మాణ పనుల్లో భాగంగా లిఫ్టు పైపులను పైకి పంపిస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బోర్గం(పి)లో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోర్గం(పి) గ్రామంలోని సందగిరి భూమారెడ్డికి చెందిన కమర్షియల్ భవన నిర్మాణ పనులను అహ్మద్ మిశ్రా అనే కాంట్రాక్టర్ చేపడుతున్నారు. ఈ భవనంలో లిఫ్టు అమర్చేందుకు గాను కూలీలు పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం నాందేడ్ జిల్లాకు చెందిన కిరణ్ (30), దీపక్ (20) అనే ఇద్దరు కూలీలు లిఫ్టు పైపులను భవనం పై అంతస్తులోకి పంపించేందుకు ప్రయత్నిస్తున్నారు. పైపులను సిమెంట్ మిశ్రమం ఉన్న పై అంతస్తుకు చేరవేస్తుండగా, అనుకోకుండా అవి పైన ఉన్న 33/11 కెవి విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో ఒక్కసారిగా భారీ స్థాయిలో విద్యుత్ ప్రసరించడంతో కిరణ్, దీపక్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని నగరంలోని ప్రగతి ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, చికిత్స పొందుతూ కిరణ్ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీపక్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వారాహీ అమ్మవారి ఆలయ నిర్మాణం



(నిజామాబాద్ ఇదీసంగతి)

వారాహీ అమ్మవారి కృపాకటాక్షాలు నగర వాసులపై ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆకాంక్షించారు. నగరంలోని అమ్మా నగర్లో నిర్మిస్తున్న ఆలయ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలోని తొలి వారాహి అమ్మవారి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కృష్ణశిల తో ఆలయాన్ని నిర్మించటం సంతోషకరమన్నారు. ఇందూరులో ఆధ్యాత్మిక చింతన పెరిగిందని, హిందువుల ఐక్యతకు ఆలయాలు దోహదపడతాయన్నారు. యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిత్య ఆలయ దర్శనం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఇకపై జరిగే వారాహీ అమ్మవారి పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మంచాల జ్ఞానేందర్, ఎల్ వీ ఆర్ అధినేత శివ ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ అప్పులు చేశాడు.. గయాబ్ అయ్యాడు..!

(మొదటి పేజీ తరువాయి)

విరమణ చేసిన రెండో రోజే అప్పులు క్లియర్ చేస్తానని హామీ ఇచ్చాడు. వారికి మరింత నమ్మకం కల్గించడానికి బెనిఫిట్‌లు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని అందుకే నేరుగా తనుకూడా ఆన్‌లైన్‌లోనే ఖాతాలో వేస్తానంటూ అందరి బ్యాంకు ఖాతా నెంబర్‌లు సైతం తీసుకున్నాడు. అన్నట్లుగా సదురు ఉద్యోగి రిటైర్ అయ్యాడు. ఆయన పదవి విరమణ రోజే ఆయనకు రావాల్సిన డబ్బు కూడా వచ్చేసింది. కానీ పదవి విరమణ చేసిన మరుసటి రోజు నుంచే ఎవరికి అందుబాటులో లేకుండా పోయారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి పెట్టాడు. తమ అప్పులు తీరుస్తాడని ఎదురు చూస్తున్న వారంతా గాబరా పడ్డారు. నేరుగా ఆయన ఇంటికి వెళ్లారు. ఇంట్లో లేరు. అక్కడికి వెళ్ళాక అసలు విషయం తెలిసి లబోదిబోమన్నారు. నగరంలో ప్రైమ్ ఏరియాలో ఖరీదైన ఇల్లు సైతం అప్పటికే గుట్టు చప్పుడు కాకుండా అమ్మేశాడట. అదే కార్యాలయంలో ఉండే అతని సన్నిహితుడైన మరో ఉద్యోగిని కలిసి కాళ్ల వేళ్ళ పడుతున్నారు తమ డబ్బులు ఇప్పించాలంటూ వేడుకుంటున్నారు.

## తెలంగాణ విశ్వవిద్యాలయం బాలికల హాస్టల్‌లో నీటి కష్టాలు.. విద్యార్థినుల ధర్నా



(నిజామాబాద్ ఇదీసంగతి)

నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయం బాలికల వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్యపై విద్యార్థినులు గురువారం ఆందోళనకు దిగారు. గత కొన్నిరోజులుగా హాస్టల్‌లో తాగునీరు, వినియోగ నీటి సరఫరా సరిగా లేక కనీస అవసరాలు కూడా తీర్చుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యను పలుమార్లు విశ్వవిద్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ, క్యాంపస్‌లోకి వచ్చిన ఆర్టీసీ బస్సును అడ్డుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం క్యాంపస్ ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

వెంటనే హాస్టల్‌లో నీటి సరఫరాను పునరుద్ధరించి, విద్యార్థినుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు విశ్వవిద్యాలయ అధికారులను డిమాండ్ చేశారు. ఆందోళనతో క్యాంపస్‌లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## తెలంగాణ యూనివర్సిటీలో అరుణోదయ నాగన్నకు నివాళులు



(నిజామాబాద్ ఇదీసంగతి)

ఇటీవల మరణించిన కామ్రేడ్ అరుణోదయ నాగన్న కు తెలంగాణ యూనివర్సిటీ లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందర పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న సమాజ మార్పుకు ప్రజాయుద్ధ పంథా మార్గమని, ప్రజల విముక్తి నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే సాధ్యమని నమ్మి తాను ఎంచుకున్న రాజకీయాల పట్ల తుది శ్వాస వరకు అవిరామంగా కృషి చేశారనీ. కామ్రేడ్ అరుణోదయ నాగన్న తెలంగాణ ఉద్యమం నుండి నేడు మరణించే వరకు కూడా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ తన పాటలతో ప్రజలను చైతన్యం చేశాడని, నిజామాబాద్ జిల్లా లో జరిగిన పి డి ఎస్ యూ మహాసభల్లో తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించాడని గుర్తు చేశారు, నేటి
ఫాసిస్ట్ కాలంలో ప్రజల తరపు నిక్కచ్చిగా నిలబడిన కామ్రేడ్ అరుణోదయ నాగన్నను కోల్పోవడం విప్లవోద్యమానికి, భారత విప్లవ సాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటనీ అన్నారు, నాగన్న ఆశయ సాధన కోసం ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి గౌతం రాజ్,జిల్లా నాయకులు రాకేష్,హుస్సేన్. నిఖిల్ నిజామాబాద్ నగర అధ్యక్షులు పవన్ , తే యూ నాయకులు దినేష్ కార్తీక్,జ్ఞానేశ్వర్, రోహన్ తదితరులు పాల్గొన్నారు.